జైళ్ల శాఖ లేఖలు బుట్టదాఖలు!

- ప్రభుత్వం కోల్పోతున్న రూ.3 కోట్ల భూమి
- స్థలం స్వాధీనంపై కొత్త డీసీపీ స్పందించేనా..
- పూర్తవుతున్న అక్రమ భవనం


జైళ్లశాఖ స్థలంలో నిర్మించిన అక్రమ భవనం

చంచల్‌గూడ: దేశంలోనే నెంబర్ 1 పోలీస్ శాఖగా తెలంగాణ పోలీస్ మంచి పేరును గడించింది. నేరాలను అదుపు చేయడంలో అనునిత్యం శ్రమిస్తోంది. కానీ జైళ్లశాఖ వారికి అప్పజెప్పిన స్థలాన్ని మాత్రం కాపాడుకోలేని దీన స్థితిలో పడిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- హైదరాబాద్‌లోని సైదాబాద్ చౌరస్తాలో జైళ్ల శాఖకు చెందిన స్థలం కబ్జాకు గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు జైళ్ల శాఖ అధికారులు. నూతన సౌత్‌ఈస్ట్ డీసీపీ కార్యాలయ నిర్మాణానికి తమ స్థలం వినియోగించుకోవాలని జైళ్ల శాఖ సౌత్‌ఈస్ట్ డీసీపీకి అడ్వాన్స్ పొజిషన్‌కు లేఖ రాసింది. సదరు స్థలంలో సగం నూతన డీసీపీ కార్యాలయం నిర్మించగా.. మరో సగం స్థలంలో కబ్జాదారులు జీ+5 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. కబ్జాకు గురైన స్థలం విలువ మార్కెట్ ధర ప్రకారం దాదాపు రూ. 3 కోట్లు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో విలువైన స్థలం కబ్జాదారుల చెరలోకి వెళ్తుందని పలువురు వాపోతున్నారు.

పోలీసులదే బాధ్యత : జైళ్ల శాఖ

సైదాబాద్‌లోని జైళ్ల శాఖకు చెందిన 684 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు గత జూన్ నెలలో సౌత్ ఈస్ట్ డీసీపీకి లేఖ ఇచ్చినట్లు జైలు అధికారులు వెల్లడించారు. అట్టి స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా భవన నిర్మాణం చేస్తున్నట్లు ఫిర్యాదు అందింది. ఈ స్థలాన్ని సందర్శించి పరిశీలించిన అధికారులు అక్రమ భవన నిర్మాణాలను ఆపి తగిన చర్యలు తీసుకోవాలని చార్మినార్ జోనల్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

- పోలీసుశాఖ నిర్లక్ష్యం ఇటు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ శాఖ అనుమానాస్పద వ్యవహారం కబ్జాదారుడికి వరంగా మారిందని జైళ్ల శాఖ అధికారులు చెబుతున్నారు. సాక్షిలో ప్రచురితమైన కథనాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు జైళ్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

డీసీపీల బదిలీతో కొలిక్కిరాని సమస్య..

- స్థలం స్వాధీనంపై జైళ్ల శాఖ నుంచి అప్పటి డీసీపీకి లేఖ అందినప్పటికీ చర్యలకు నోచుకోలేదు. కబ్జాదారులపై కేసు నమోదుతో కొన్ని నెలలు ఆగిన అక్రమ నిర్మాణం ఎన్నికల నేపథ్యంలో డీసీపీ బదిలీ కావడంతో అక్రమ నిర్మాణం మళ్లీ ఊపందుకుంది. పోలీసు, జీహెచ్‌ఎంసీ శాఖలు ఎన్నిక విధుల్లో నిమగ్నం కావడంతో కబ్జాదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల మళ్లీ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ బదిలీ అయ్యారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీ సాక్షిగా స్థానిక ఎమ్మెల్యే జైళ్ల శాఖ స్థలం కబ్జా అంశం లేవనెత్తారు. దీనిపై అప్పటి హోంమంత్రి సానుకూలంగా స్పందించి జైళ్ల శాఖ స్థలం పోలీసు శాఖకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.
- అసెంబ్లీలో కబ్జాకు సంబంధించి చర్చ జరిగినా స్థానికంగా పోలీసులు దీనికనుగుణంగా చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ప్రస్తుతం ఉన్న డీసీపీ ఈ అంశంపై దృష్టి సారించి తగిన చర్యలకు పూనుకుంటే విలువైన స్థలం పోలీసుల స్వాధీనంలోకి వెళ్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

చైతన్యపురి: డివిజన్‌లోని కోదండరాంనగర్ కాలనీలో సీసీరోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి సీసీరోడ్డు పునర్నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తమ సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కాలనీ అధ్యక్షుడు కందికంటి ప్రేమ్‌నాథ్‌గౌడ్, కాలనీవాసులు రత్నం, శ్రవణ్, టింకు, నాయకులు మురళి, సాయినాథ్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలోరూల్లో...) టమాటా లోకల్ రూ.13, వంకాయ రూ.23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 21. దొండకాయ 23, ఆలుగడ్డ 21, ఉల్లిగడ్డ 22, గోకర 35, దోసకాయ 19, సొర 09, పొట్లకాయ 13, అరటి 10, చిక్కుడు 50, అర్వి 45, మునగ 28, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 23, ఫ్రెంచ్‌బీన్స్ 45, కాప్సికమ్ రూ.65 గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు వేసి కబ్జాకు యత్నిస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం వ్యర్థాలను తొలగింపజేశారు. కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు ఫిర్యాదు చేయటంతో కమిషనర్ ఆదేశానుసారం జీహెచ్‌ఎంసీ అధికారులు వ్యర్థాలను తొలగించారు. స్పందించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బద్దం సత్యనారాయణగౌడ్

నాగోలు: వేసవికాలంలో చలివేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగపడతాయని నాగోలు గౌడ సంఘం నాయకులు బద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలో హనుమాన్ యువసేన నాయకులు మహేష్, కోటయ్య ఆధ్వర్యంలో నాగోలు కట్ట వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జాగ్రత్తలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. నాగోలు కట్ట సమీపంలో మహేష్, కోటయ్యలు గత 9 ఏళ్లుగా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు బద్దం నరేందర్‌గౌడ్, చెర్కు ఉమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు


విద్యుత్ కాంతులతో వెలుగుతున్న దేవాలయం

నేటి నుంచి కర్మన్‌ఘాట్ హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయ బ్రహ్మోత్సవాలు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ హరిహర క్షేత్రంలోని అయ్యప్ప స్వామి కోరిన కోర్కెలు తీరుస్తూ.. భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. హరిహరక్షేత్ర అయ్యప్పదేవాలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు 5 రోజుల పాటు జరుగనున్నాయి. బైరామల్‌గూడలోని కర్మన్‌ఘాట్‌లో నెలకొన్న అక్కన్న, మాదన్న దేవాలయాల ప్రాంగణంలో దాదాపు రూ.13 కోట్లతో వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ క్షేత్రంలో 140 టన్నుల ఏకశిలతో నిర్మించిన పదునెట్టాంబడి ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ దేవాలయంలో జంటనగరాలల్లోని అయ్యప్ప భక్తులు, మహిళా భక్తులు శబరికి వెళ్లలేని వారు హరిహరక్షేత్రంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని ముడుపులు, ఇరుముడులను సమర్పిస్తారు. భాగ్యనగరంలోనే అతిపెద్ద అయ్యప్ప దేవాలయమైన కర్మన్‌ఘాట్ హరిహక్షేత్రం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ దేవాలయాన్ని ముస్తాబు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



కర్మన్‌ఘాట్‌లోని హరిహరక్షేత్రం అయ్యప్ప దేవాలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. దాతల సహకారంతో ఐదు రోజుల పాటు అన్నదానం ఉంటుంది.

– వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్



ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు


పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న సిబ్బంది

ఎల్‌బీనగర్: పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వేసవికాలం దృష్ట్యా కేంద్రాల వద్ద తాగునీటి వసతి, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ అడ్డుకట్ట వేసేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన సిట్టింగ్ స్క్వాడ్‌లు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులు పరీక్షల నిర్వహణ అధికారులు, ఇన్విజిలేటర్లు కేంద్రాలల్లో అనుమతి లేదని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సమయం కంటే ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉందని వివరించారు. ప్రతీ కేంద్రం వద్ద బందోబస్తుగా పోలీసులను నియమించారు.

హయత్‌నగర్: హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన సుమారు 7241 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ హీర్యానాయక్ తెలిపారు. విద్యార్థులను 8:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించామని, సమయం మించిన తర్వాత ఎవరూ రాలేదని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

ముగిసిన జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

చైతన్యపురి: భాష్యం జోన్–3కి సంబంధించిన లిటిల్ చాంప్స్ జోనల్ లెవెల్ ఫైనల్ స్పోర్ట్స్ మీట్ ముగిసిందని జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు తెలిపారు. ఎనిమిది బ్రాంచీల విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. ఆయా బ్రాంచీల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

మన్సూరాబాద్: నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ సభ్యుడిగా వడ్డేపల్లి రాంచందర్ నియమితులయ్యారు. సోమవారం జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌతరన్ రీజియన్ చైర్మన్ ఆదర్ల మహేష్, సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో రిజర్వేషన్ల అమలు, రిస్టోర్ విధానాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. నేషనల్ కమిషన్ డైరెక్టర్ సునిల్‌కుమార్‌బాబు, అసోసియేషన్ నేతలు ఆనంద్‌కుమార్, లింగ్య, అరుణ్‌కుమార్, బాబు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జీఎస్‌ఐ ఉద్యోగ సంఘం నేతలు

దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య



చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన ముత్తినేని వీరయ్యను వికలాంగుల కార్పొరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సన్మానించారు. సోమవారం చైర్మన్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన యూనియన్ నాయకులు ఆయనకు శాలువాతో సన్మానించారు. దివ్యాంగుల కార్పొరేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎన్ చారి, ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు, ఉపాధ్యక్షుడు రవీందర్, శ్రీను, నీలావతి పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

నాగోలు: గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్న ముగ్గురిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.49,720 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ పరిధి భరత్‌నగర్‌కాలనీలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా కొత్తమంది పేకాడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అంబర్‌పేట్‌కు చెందిన శ్రీనివాస్, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన శివప్రసాద్, భరత్‌నగర్‌కు చెందిన విజయ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

శుభాకాంక్షలు

నాగోలు: మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా సోమవారం నాగోలుకు చెందిన సీనియర్ కురుమ సంఘం రాష్ట్ర నాయకులు, యెగ్గె బిక్షపతి ఆధ్వర్యంలో దేవేందర్‌గౌడ్‌ను కలిసి తలపాగ చుట్టి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



రజక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలి


నాగోలు శ్రీ బాబా రజక సహకార సంఘం నూతన కమిటీ సభ్యులు

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం రజక ఫెడరేషన్ ద్వారా రజక వృత్తిదారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. సోమవారం నాగోల్‌లో జరిగిన శ్రీ బాబా రజక సహకార సంఘం సమావేశం బొడ్డుపల్లి మధు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రజకులకు నూతనంగా ఫెడరేషన్, చైర్మన్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రజక వృత్తిదారుల సహకార సంఘాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నూతన కమిటీ ఏర్పాటు..

నూతన అధ్యక్షుడిగా బొడ్డుపల్లి సహదేవ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇద్దరు డైరెక్టర్లతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి


మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌తోనేరాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, రాజిరెడ్డి, గజ్జల మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్‌కుమార్, సామ తిరుమలరెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధుల నిర్వహణ



చైతన్యపురి: ప్రజలందరికీ అందరికీ అందుబాటులో ఉంటూ.. సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో పని చేస్తానని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై సందర్భంగా సోమవారం సాయంత్రం చైతన్యపురి కార్యాలయంలో మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి రాష్ట్ర అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. పలు డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకులు మల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. మంజులారెడ్డి, శశిధర్‌రెడ్డి, వేణుయాదవ్, గుర్రం శ్రీనివాసరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వీఎస్ఎన్ శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, జయమ్మ, జైపాల్‌రెడ్డి, సుజాతరెడ్డి, భాస్కర్‌చారి, ఎస్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీసీపీ జానకి, పోలీస్ సిబ్బంది

సైదాబాద్: ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి తెలిపారు. సోమవారం సాయంత్రం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో డీసీపీ పాల్గొన్నారు. సైదాబాద్ పీఎస్ నుంచి మొదలైన పోలీసుల ఫ్లాగ్‌మార్చ్, పూసలబస్తీ, లక్ష్మీనగర్, ఖాజాబాగ్, రెడ్డికాలనీ, కృష్ణానగర్, సరస్వతీనగర్ మీదుగా భూలక్ష్మినగర్, సపోటాబాగ్‌ల నుంచి సాగి కవాతు ఐదు కిలోమీటర్లు పూర్తి చేసుకుని తిరిగి సైదాబాద్ పీఎస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీసీపీ జానకి మాట్లాడుతూ.. సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫ్లాగ్‌మార్చ్‌లో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి, సైదాబాద్ ఏసీపీ వెంకన్ననాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డీఐ కొండల్‌రెడ్డి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, 50 మంది కేంద్ర బలగాల బృందం పాల్గొన్నారు.

నేటి తరానికి 'కొమురయ్య' తెలియాలి

సుల్తాన్‌బజార్: దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను నేటి తరాలకు అందించేందుకు దొడ్డి కొమురయ్య సినిమాను నిర్మిస్తున్నామని ఆ సినిమా డైరెక్టర్ ఎం.సేనాపతి తెలిపారు. హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ 33 జిల్లాల కమిటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఎం.సేనాపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య మనుమడు దొడ్డి చంద్రం హాజరై మాట్లాడారు. దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణం కోసం దర్శకుడు సేనాపతి తెలంగాణలో ఉన్న 33 జిల్లాలను తిరుగుతూ ప్రతి జిల్లాలో సినిమా గురించి వివరిస్తూ అందరిని భాగస్వాములను చేయడం గొప్ప ప్రయత్నమన్నారు. కంది సూర్యనారాయణ, భూమన్న, సుబ్బయ్య, బిక్షపతి గౌడ్, రావుల సురేష్, మురళీకృష్ణ, భగవాన్‌దాస్, ఆంజనేయులు, పోతిరెడ్డి రమణ, హన్మంతు, జె.శ్రవణ్ పాల్గొన్నారు.

మల్‌రెడ్డి రామ్‌రెడ్డికి సన్మానం



నాగోలు: తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని సోమవారం నాగోలు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు పెద్దవూర బ్రహ్మయ్య ఇతర పార్టీ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్‌రెడ్డి రామ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి స్థానిక ప్రజలకు చేసిన సేవలను గుర్తించి అధిష్టానం ఓ ఉన్నతమైన స్థానం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. నాగోల్ డివిజన్ అధ్యక్షురాలు మంజులరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు చైతన్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



ఎల్‌బీనగర్: ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటుపై పలువురు ఎరుకల సంఘం నాయకులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కిగౌడ్‌ను కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఎరుకల సంఘాన్ని గుర్తించి ప్రభుత్వం ఏకలవ్య ఎరుకల సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది ఎరుకల వృత్తి దారులకు న్యాయం చేసినట్టైందని ఎరుకల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ వృత్తి కులం వారికి ఇప్పటి వరకు ఎలాంటి లబ్ధి జరగలేదన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల రుణాలు మంజూరు చేసి కులవృత్తులను ప్రోత్సహించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు బుడ్డ సత్యనారాయణ, కురాకుల కృష్ణ, సుల్తాన్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

20న 'ఘంటసాల గంధర్వ గానామృతం'

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఈ నెల 20వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘంటసాల గంధర్వ గానామృతం పేరిట కచేరి నిర్వహిస్తున్నట్లు ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ అధినేత, స్వరసామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అనేకమంది గాయనీగాయకులు ఘంటసాలకు సంబంధించిన పాటలు పాడతారని తెలిపారు.